# సెగ లోగిలి

శాంతీ! బావున్నావా!

రిప్లై లేట్ చేశాను. తిట్టుకోకేం... ఐనా తిట్టేంత ధైర్యం నీకెక్కడవుందిలే! అదుంటే నీ మొగుడు అంతగా కొత్త కొత్త తెలుగు పదాలను కనిపెట్టి నీ మీద ప్రయోగించడుగదా!

నువ్వన్నది నిజమేనే! మేమెప్పుడూ తిట్టుకోం... ఒకర్నొకరం గౌరవంగా పిల్చుకోవడంతప్ప.

వాస్తవమే! మేమెప్పుడూ కొట్టుకోం. అనుమతి తీసుకొని ఎదుటి శరీరాన్ని స్పర్శించడం తప్ప.

తిట్టుకోవడాలూ, కొట్టుకోవడాలూ అనాగరిక విషయాలని ఆయన ఉద్దేశ్యం. ఒకరి శరీరం మీద మరొకరికి అదుపు తప్పేంత హక్కు ఉంటుందనేది కూడా ఆయనకు తెలియని విషయం.

ఎదుటివారి మీద అసహనం తన్నుకొస్తోన్నా చాలా సౌమ్యంగా.. పొలైట్‌గా.. జెంటిల్‌గా భావవ్యక్తీకరణ చేసుకోవాలి. ఇది నాగరికతే నేస్తం.

ఈవెన్ సెక్స్ విషయంలోనూ. మీ ఆయనలా రాత్రయ్యేసరికి పాదాలవద్దకుచేరి, పగటి తప్పుల్ని క్షమించమని ప్రాధేయపడటం, బుజ్జగించడం... అలాటివన్నీ మా మధ్య ఉండవు.

లేటవర్స్ భోజనం.. అవసరమని అనిపిస్తే ఎవరో ఒకరం కొన్ని కొన్ని సంకేతాలతో ప్రపోజ్ చేయడం.. అవతలి బాడీ సరిగ్గా స్పందిస్తే ఓ.కే.. ఇట్స్ బయాలజికల్ నీడ్... తీర్చేసుకుంటాం. ఆర్థికపరమైనవో, మరేవో సమస్యలవల్ల నీ మగడు బాగా డిస్టర్బ్ అయి నీమీద తిట్లరూపంలో దూకొచ్చు. అలాగే అది నీకు తరచూ ఇబ్బంది పెట్టే సమస్యే కావొచ్చు.

'తిట్లూ, కొట్టడాలూ' అనే దృష్టికోణం నించి లోకాన్ని చూస్తూ మేమేదో సమస్యల్లేని జీవితాన్ని గడుపుతున్నామని వూహించుకోవద్దు. మా బాధలు మాకుంటాయి. బాధల్లేని ఇల్లాలు ఈ భూప్రపంచంలో ఇంకా పుట్టలేదే పిచ్చిమొద్దూ!

నన్ను గురించి ఏదేదో వూహించుకోనివ్వడం నాదే తప్పు. నా జీవితాన్ని కూడా నీకులాగే తెరచిన పుస్తకంలా నీ ముందు పరవకపోవడం పొరబాటే. హైస్కూలుతోనే చదువు మానేసి ఇంటివద్ద ఉన్న నువ్వు నన్ను గురించి ఎప్పుడూ ఉన్నతంగా ఊహిస్తోంటే ఆ ఫీలింగ్‌నించి బైటపడే ధైర్యం లేకనే ఇప్పటిదాకా ముసుగులో వున్నాను.

నాకూ సమస్యలున్నాయి. నీలా తిట్లరూపంలోనో, దెబ్బలరూపంలోనో కాకున్నా – నాగరికత అద్దిన అధునాతన సభ్యత రూపంలో .

ఉదాహరణకు నేనొక చిన్న సంఘటన చెబుతాను. నీకు బాగా అర్థమయ్యేందుకు విను.

★★★

ఆ రోజు మా ఆయన లంచ్ మానేశాడు.

మధ్యాహ్నం ఆఫీసుకొచ్చి నన్ను పికప్ చేసుకొన్నాడా - ఐదునిమిషాల్లో ఇంటికొచ్చాం - కారులో ఒక్క మాట కూడా మాట్లాడుకోకుండా.

అట్లా సీటులో వాలి వర్క్ ప్రెజర్‌నించి రిలాక్స్ అయ్యేలోపలే ఇల్లొచ్చింది. నేనంటే సరే - ఆయన కూడా మౌనంగానే ఉండిపోయాడనే విషయం కారు దిగిన తర్వాతగాని నాకు అర్థం కాలేదు.

ఫ్రిజ్ వాటర్ కొంత కలుపుకొని కళ్ళమీదుగా రెండుసార్లు అట్లాస్మూత్‌గా చల్లదనాన్ని ఫీలవుతూ మొహం కడుక్కొనేసరికి అప్పటిదాకా నుదుటి మధ్య జిడ్డులా అంటుకొనివున్నం భారం కాస్తా కరిగిపోయి మనస్సు ఎంతో తేలికపడింది.

టేబుల్‌మీద అన్నీ సర్దేసరికి ఆయన వచ్చి కూర్చున్నాడు. ఆ కూర్చోవడంలోనే కొంత తేడా కన్పించింది నాకు. భోంచేసే స్టైల్‌లో లేదు.

జస్ట్... కబుర్లు చెబుతూ కంపెనీ ఇచ్చేందుకులా మరో కోణంలో రిలాక్సవుతూ... రెండు సార్లు కళ్ళెత్తి చూసి ప్లేట్‌లో వడ్డించి ముందుకు జరిపి నేను కూడా కూర్చున్నాను. అన్నం కలుపుకొంటూ తలెత్తి చూస్తే ఆయన అదే భంగిమలో...

"హ్యావిట్" అన్నాను. పలుకలేదు. "టైమ్ అవుతుంది గదా!" చెప్పాను నొసలు ముడేస్తూ.

అర్ధగంటలో అన్నీ ముగించుకొంటేగాని సమయానికి ఆఫీసుకు వెళ్ళలేం మరి.

"ప్లీజ్.." నా ఆతృత నాకుంది.

అప్పుడు తను నాకేసి కళ్ళెత్తాడు. ఆ చూపుల్లో తేడా కన్పిస్తోంది. అసహనమూ, అసహజతా, కోపమూ మరేవో భావాలు కలగలిసిన ముడి చూపులు.. తరచూ నా అనుభవానికొచ్చే చూపులే అవి... నాకేసి గురిపెట్టి కసిగాచూస్తూ, కొంత కరకు స్వరంతో "నాకక్కరలేదులే.." అన్నాడు.

ఒకటికి రెండుసార్లు తనకేసి చూశాను.

మరో మాటకు అవకాశంలేని వేడి సెగ తన లోంచి పొంగుతూవున్న విషయం నాకు బాగా అర్థమవుతూవుంది. కారణం వూహించాలన్న స్పృహకూడా కలుగలేదు. భోంచేయాలో లేదో కూడా తెలిసిరాలేదు. మునివేళ్ళతో అటూ ఇటూ కెలికి కొంత టైం పాస్‌చేసి ప్లేట్‌ను తీసుకెళ్ళి సింక్‌లో వేశాను. పాత్రల్ని ఎత్తి, టేబుల్ క్లీన్ చేశాను.

ఒక్క క్షణం అద్దం ముందు నిలబడి, తర్వాత ఆయనకేసి తిరిగి "ఒకే.. ఐయాం రెడీ!" చెప్పాను.

కారులో ఇద్దరం మౌనంగానే ఉండిపోయాం.

నాకు తెలుసు - తను భోంచేయకపోవడానికి కారణం అడిగి తెలుసుకోలేదనే కోపం అతనిలో సుడులు తిరుగుతూ వుంటుందని.

అలాగని కారణం అడిగి, నేరస్తురాలిగా నిలబడి, ఆయన అహాన్ని కరిగించే ప్రయత్నంలో నన్ను నేను కోల్పోయేంత నరకయాతన అనుభవించి ..దానికంటే ఓ పూట పస్తులుండటమే ఆరోగ్యకరం కదా! పడుకొనే లోపల ఎప్పుడో ఒకసారి ఆయనే బరస్ట్ అవుతాడు. వెయిట్ చేద్దాం.

అట్లా అనుకొన్నానేగాని మనస్సులో ఓ మూల ఏదో అలజడి జరజరమంటూనే వుంది. ఆయన్ను లంచ్‌కు దూరం చేసేంత తప్పు నేనేం చేశానో అర్థం కాలేదు. ఏదో జరిగింది ఏమిటది.

నా శరీరంమీదే ఏదో అస్తవ్యస్తత.. నాకు తెలీకుండా ఆయన కళ్ళల్లోపడిన పొరపాటు.. ఏమిటది? ఉదయం నుంచి జరిగిన చిన్న చిన్న విషయాలను కూడా జారిపోనీకుండా దృశ్యాలన్నిటినీ రివైండ్ చేసి చూసుకొన్నాను. ప్చ్... అంతా రోజూలా రొటీన్‌గానే వుంది. ఒక్కటి కూడా కొత్తగా మనసుని కుదిపే సంఘటన గుర్తుకు రావట్లేదు.

ఎప్పటిలా ఉదయాన్నే లేచారు. తను బాత్రూంకి వెళ్ళివచ్చే లోపల దుప్పట్లు మడచి పడక శుభ్రంగా ఉంచాను - ఆయన చిరాకుపడకుండా.

పేపర్ తీసుకొని కుర్చీలో కూర్చోగానే కాఫీ కప్పు అందివ్వబోతే "ఏమంత తొందర? తాగాలనే కోరిన పుడితేనే కాఫీ టేస్ట్‌గా వుంటుంది. నువ్విచ్చినప్పుడు తాగితే కాదు..." అంటూ సలహా.

నిజమే.. ఆయన కోరుకున్నప్పుడు అందించి ఆయన్ను తృప్తిపరిస్తేనే బావుంటుంది. కాదనను... కానీ నా తొందర నాది. టిఫిన్ కావాలి. లంచ్ ఇప్పుడే ప్రిపేర్ చేయాలి. అవన్నీ చేసుకొంటూనే ఆయన అడిగినప్పుడు మళ్ళీ వేడిచేసి అందించాను.

ఇడ్లీలోకి సాంబారు చెయ్యాలనుకొన్నానుగాని, అతను దాన్ని నెలరోజుల్నించి ముట్టడంలేదు. సమయానికి ములక్కాయలు దొరక్కపోవడం, ఆయనకు ఆరోజే మునక్కాయ సాంబారు మీద కోరిక కలగడం, అంత చిన్న కోరికను కూడా తను తీర్చలేనందుకు సాంబారునే నిషేధించడం జరిగిపోయింది. అందుకే ఆయనకిష్టమైన వేరుసెనగ పచ్చడిలో వేడి వేడి నెయ్యి వడ్డించాను.

నేను రెడీ అయ్యేసరికి డ్రైవర్ కారు తీశాడు. నన్ను ఆఫీసువద్ద వదిలి వెళ్ళాడు. మధ్యాహ్నం ఆఫీసునించి ఆయనే డ్రైవ్‌చేసుకొంటూ వచ్చాడు. అంతే... ఆయన చేత భోజనం మాన్పించేంత తప్పు ఏంచేశానో నాకు ఎంతకీ అర్థం కాలేదు.

నా ఫిజిక్ కొంత ఎక్స్‌పోజింగ్‌గా వుంటుందేమో! నువ్వు కూడా అప్పుడప్పుడూ కామెంట్ చేసేదానివి. నన్నేం చేయమంటావు చెప్పు? నా బాడీ నిర్మాణమే అంత. నాకు తెలుసు, పలుచని చీర కట్టుకొంటే నా శరీరంలోని ఎత్తుపల్లాలు స్పష్టంగా బైటకు కన్పిస్తాయని. అందుకే వీలైనంత వరకు శరీరాన్ని దాచుకొనే శైలిలోనే డ్రెస్ చేసుకొంటాను.

మరో మాటలో చెప్పాలంటే సిలిండర్‌లా కన్పించేందుకే ప్రయత్నిస్తాను. ఎక్కువగా పట్టు, గద్వాల్ నేత చీరలు వగైరా వగైరాలనే ధరిస్తాను. పల్చటి చీరలు రెండో మూడో వున్నాయి. నెలకో, నెలన్నరకో వాటి వంతు వస్తుంది. అవి కట్టుకొన్నరోజు ఏదో కొత్తగా, తేలిగ్గా, రిలాక్స్‌గా ఫీలవుతాను.

నాకు నేను అందంగా కూడా కనిపిస్తాను. ప్యూపాను చీల్చుకొచ్చిన సీతాకోకచిలుకలా గాలిలో తేలిపోతున్నట్లుంటుంది. కానీ ఆ రోజు లంచో, డిన్నరో మానేస్తాడు మా ఆయన.

తను ఎప్పుడన్నా క్యాంపుకు వెళ్ళినప్పుడు నేనా చీరల్ని ఇష్టంగా కట్టుకొని సాయంత్రం కాగానే వదిలేస్తానా - వాషింగ్ మెషిన్‌లో వేసేప్పుడో ఉతికి ఆరేసినప్పుడో పసిగట్టేస్తాడు. మళ్ళీ మామూలే. మౌనవ్రతంపట్టి వాత పెట్టేసుకొంటాడు.

కానీ ఇప్పుడట్లా జరగలేదుగదా! శరీరం సిలిండర్‌లాగే ఉందిగదా! పట్టుచీర మడతల్లో ముడుచుకొని. మరెందుకు ఆయన అలిగినట్లు?

నైటీతో వీధిలోకి వెళ్ళినా ఆయనతో ఇబ్బందే. తోపుడు బండివాడి కేక ఇల్లు దాటిపోయే లోపల నైటీ వదలి చీర చుట్టుకురాలేముగదా! నైటితోనే వీధిలోకి వెళ్ళక తప్పదు. కూరగాయలు కొని తెచ్చే ఆ కొద్ది సమయంలో ఎవడో ఒకడు నాకేసి చూస్తూ వెళ్ళడం ఆయన కళ్ళబడక తప్పదు. ఇంట్లోకి వెళ్ళిం తర్వాతగాని నాకావిషయం తెలిసిరాదు.

ఆయన బాధంతా - నలభైయేళ్ళ వయస్సులో కూడా బింకం సడలని నా బాడీ స్ట్రక్చర్‌కు సంబంధించిన ఇమేజ్ వాళ్ళ కళ్ళల్లో ఫిక్సయిపోయివుంటుందిట. కనీసం ట్వంటీఫోరవర్స్ అయినా మెమొరీలో ఉండి డిలీట్ కాదుట... నేనేం చేయను?

ఇట్లాంటి చిన్న చిన్న విషయాలే ఆయనచేత చాలాసార్లు ఉపవాసాలు చేయించాయి. ఈ రోజు అలాంటి 'సేవ్' అయిపోయే సీనేదీ క్రియేట్ కాలేదు గదా! మరెందుకు లంచ్ మానాడు?

నేను గౌరవనీయమయిన ఉద్యోగం చేస్తోన్నా, మహిళా సంఘాల యాక్టివిటీస్‌లో చురుగ్గా పాల్గొంటున్నా, బాగా చదువుకొన్నదాన్నయినా, సంప్రదాయబద్ధంగానే జీవిస్తున్నాను గదా!

అత్తకు, మొగునికి, కొడుక్కి వండి వడ్డించడం, వాళ్ళకు సేవలు చేసుకోవటం, ఇంటి పనులు చేయడం నా బాధ్యతగానే ఫీలవుతున్నాను గదా! వాళ్ళకు నేనేమీ లోపం చేయట్లేదు గదా! మరెందుకిట్లా జరుగుతోంది? ఎందుకలా వేధిస్తోంది?

భోజనం మానేసిన కోపం తాలూకు వేడి ఒక్కో రోజు ఒక్కో సమయంలో బైటకు కక్కేస్తాడు. మరీ రాత్రిపూట పడకమీద బైటపడ్డప్పుడే జీవితం మీద నాకు వరుస ప్రశ్నలు మొలుచుకొస్తాయి.

రొమాంటిక్ మూమెంట్‌నొకదాన్ని క్రియేట్ చేయాల్సిన ఆ సమయంలో "నేనంటే నీకస్సలు గౌరవం లేదు" అంటూ ప్రారంభిస్తాడు.

"మొగుడనే ప్రాణి ఒకటి దగ్గరే ఉందనీ, దాని మీద రవ్వంత ప్రేమ చూపుదామనీ లేదు" అంటూ కొనసాగిస్తోంటే, మూడ్‌పోయి నా పొరబాటేమిటో అన్వేషించుకొనే ప్రయత్నంలో నేనుంటాను.

"నువ్వొ ఎంప్లాయివే. నేను కాదనడం లేదు. మగాళ్ళతోటి మీ సమాన హక్కుల్ని నేనడ్డుకోవటం లేదు. నీ సంగీత సాహిత్యాభిమానాల్ని నేను ప్రశ్నించడం లేదు. మొగుణ్ణి కూడా పిసరంత శాటిస్ఫై చేయాలనే విషయాన్ని కూడా అందులో చేర్చమంటున్నా" అంటోంటే ఏమి అనాలో తెలియక అయోమయ స్థితిలో స్తబ్ధంగా వుంటాను.

అప్పుడు అసలు విషయం బైటకు కక్కుతాడు.

"జీడిపప్పంటే నాకిష్టమని తెలుసుగా! కప్పునిండా పాయసం ఇస్తే అందులో ఒక్కటంటే.. ఒక్క జీడిపప్పు ఉండొచ్చుగదా! చూసి వడ్డించొచ్చుగదా!" అంటూ దాన్ని బేస్ చేసుకొని గతంలో ఉప్పుతక్కువైన కూరల లిస్టు చదువుతాడు.

మాడిన అన్నం వైనాలూ, షుగర్ చాలని కాఫీ సంగతులూ, అన్నీ... ఏవీ మర్చిపోకుండా.. ఇల్లాలి పోస్టు నాకు ఎంత మాత్రమూ ఇష్టంలేనిదిగా తేల్చిపారేస్తూ...

ఇంత వేడిని కూడా గది దాటనివ్వకుండా, అత్తమ్మకు సైతం విన్పించకుండా, చాలా పొలైట్‌గా... గౌరవంగా... అవును శాంతీ!

అప్పుడు కూడా గౌరవించుకొంటూనే... పెళ్ళయిన రోజునించి ఈనాటిదాకా నేను చేసిన పొరబాట్లన్నీ ఒక్కటికూడా జారిపోకుండా గుర్తుపెట్టు కొనేంత అపారమైన జ్ఞాపకశక్తిని ఆయనకిచ్చిన బ్రహ్మదేవుడి మీద ఆ కొద్దిసేపు నాకు కసిరేగుతుంది. ఎంత సిల్లీ థింగ్!.. జీడిపప్పు విషయం అప్పుడే చెప్పుంటే పాయసంలోంచి అన్నిటినీ ఏరి ఆయనకే వడ్డించుండేదాన్నిగదా!

ఆ విషయాన్ని మనస్సులో దాచుకొని పగలంతా కుళ్ళుతూ రాత్రి పడకదాకా పయనించి అక్కడ వేడెక్కడం.. ఏమిటో ఈ మనిషి!

అంతటితో వూరుకుంటాడా? చెరోవైపు పడుకొని కళ్ళు మూసుకొంటే మరో గంటకైనా నిద్రపడుతుంది. అట్లా నిద్రపోనివ్వడుగదా! ఓ అరగంట తర్వాత తలలో సెగచల్లారి – మెల్లిగా నావైపు తిరిగి... మెడ ఒంపుల్లో తలదూర్చుతాడు.

వేడి శ్వాసలతో నాలో శృంగార వాంఛల్ని ప్రేరేపించేందుకు ప్రయత్నిస్తూ.. మునిపళ్ళతో సుతారంగా భుజం కండరాల్ని మృదువుగా నొక్కుతూ... ఆయనకు తెలుసు – ఆ స్పాట్‌ని పళ్ళతో కరిస్తే నాకెంతో ఉత్తేజాన్ని కలిగిస్తుందని.

కానీ అంతదాకా ఉడికిపోయిన నా మనస్సు అప్పుడే ఎలా సర్దుకొంటుంది? అసహ్యపడటం తప్ప. విషయం అర్థమై, ఉస్సురుమంటూ వెనక్కి సర్దుకొని తన అసలు పొజిషన్‌కు వెళ్ళి మళ్ళీ వేడి బుసలు "కనీసం ఈ సుఖానికి కూడా నువ్వు సహకరించవు..." అంటూ గొణగడం.

అంటే... ఈయనగారి ఉద్దేశమేమిటి? ఇప్పటిదాకా ఈయనచేత వాతలేయించుకొన్న మనస్సు, ఇప్పుడు మీటనొక్కగానే స్పందించేందుకు రోబోట్‌లాగే ఒక లోహ యంత్రం కాదుగదా!

ఆఫీసు సమయాన్నంతా ఈ ఆలోచననే తినేశాయి శాంతీ! టైం అయిపోగానే ఫోన్‌చేసి, నేను బయటపడేసరికి కారొచ్చి ఆగివుంది.

గబగబ స్టెప్స్ దిగుతూ, ఆ కదలికలకు జారిపోబోతున్న పైటను సవరించుకొంటూ కారు డోర్ వద్దకు రాగానే, నా ఎదలకేసి చూస్తూ ఆయన చూపులు... డ్రైవర్‌కు బదులు ఆయనే వచ్చాడు.

మధ్యాహ్నంపూట ఇద్దరం లంచ్‌కి వెళ్ళాలి కాబట్టి తనొస్తాడు. మిగతా టైంలో డ్రైవర్. సాయంత్రం తనకు అస్సలు టైమ్ వుండదు.

రాత్రి లేటవర్స్‌లోగాని ఇంటికి రాడు.

అలాంటిది.. ఇప్పుడు తనే వచ్చాడంటే...? కారులోకి దూరబోతోంటే... ఇంకోసారి తన చూపులు నా ఎదలపైకి గుచ్చుతూ...

జారుతోన్న పైటను మరోసారి సవరించుకొన్నాను. సేఫ్టీపిన్ను ఉదయమే కన్పించలేదు. ఎక్కడో పెట్టి మరిచాను. ఎంత సర్దుకున్నా తను కుదురుగా ఉండనంటోంది పైట.

ఇంటికి వెళుతోంటే దారిలో ఫ్రెండ్స్‌తో కలిసి మా బాబు. ఎంసెట్ ప్రిపరేషన్ గొడవలో పడి రాత్రిళ్ళు ఫ్రెండ్స్ ఇళ్ళవద్దే గడుపుతున్నాడు.

కారు స్లోచేయగానే – "ఏ నాన్నా, రాత్రికయినా వచ్చేదుందా!" అని అడిగాను వాణ్ణి.

"వస్తానుగానీ.. ఉండను..." అని చెప్పాడు.

ఉంటే తనక్కొంత వెసులుబాటు దొరికేది.

ఇంటివద్ద కారు దిగేటపుడు కూడా ఆయన చూపులు అదేశైలిలో నా ఎదలపైకి సాగుతాయి... నా కళ్ళల్లో సన్నపాటి ప్రశ్నార్థకాలు...

అవి ఆయన చూపులతో కలవగానే "నిజంగా నాకు బుద్ధిలేదు..." అంటూ ఎంతో విసుగ్గా తలమీద నుదురుమీద కొట్టుకొన్నాడు.

"జాగ్రత్త పడాల్సిన అవసరమున్న వాళ్ళే అవేర్‌నెస్‌తో ఉండాలి. లేదూ- ఎదుటివాళ్ళు అందిస్తేనన్నా గ్రహించగలగాలి... నూటికి నూరుమందీ జాగ్రత్తపడే విషయాన్ని నువ్వెందుకు కేర్ చేయవో నాకర్థం కాదు. నీకా స్పృహ కలిగించాలనుకోవడం నాదే బుద్ధి తక్కువ. పైటను పిన్నుతో ఫిక్స్ చేసుకోవచ్చు గదా!" అంటూ డోర్ వేసుకొన్నాడు.

"నీ బాడీ స్ట్రక్చర్.. ఇమేజ్.... ఆ రోగ్... ఆ డ్రైవర్‌గాడి మైండ్‌లో.. ఆ బ్రూట్‌మైండ్‌లో... ఇదే ఇమేజ్.. ఈ రోజంతా ఇదే ఇమేజ్.. ఛీఛీ నాకు బుద్ధిలేదు..." కసిగా గొణుక్కొంటూ కారును వేగంగా ముందుకు కదిలించాడు.

అప్పుడర్థమయిందే శాంతీ! ఆయన ఎందుకు ఆ రోజు లంచ్‌ని అవాయిడ్ చేశాడో.

ఇట్లా వుంటుందే! మా సంసార శైలి.

★★★

నిజమేనే! మేం తిట్టుకోం - ఒకర్నొకరం గౌరవించుకోవడం తప్ప. మేం కొట్టుకోం - ఒకరి శరీరం మీద మరొకరికి హద్దులు మీరేంత హక్కులుండవని నమ్మడం తప్ప అది మా కల్చర్.

భంగపడటాలూ, ప్రాధేయపడటాలూ, కాళ్ళా వేళ్ళా పడటాలూ ఇక్కడ వుండవు. ఆర్థికంగా ఒకరి మీద మరొకరం ఆధారపడం కాబట్టి.

ఒకరి నిర్ణయాల్ని మరొకరం కాదనాల్సిన అవసరం లేదు కాబట్టి. అయితే ఆడతనాన్ని కాల్చేమంట మీ దగ్గరే కాదు ఇక్కడా వుంటుంది. అది సర్వవ్యాపితం. నీది పైకి కన్పించే మంట. కట్టెల పొయ్యి లాంటిది. పొయ్యి ముందు కూర్చుంటే వంటికి తాకే ఆ మంటను చూడొచ్చు.

మాది ఓవెన్‌లో మంట. కళ్ళకు కన్పించదు. అనుభవానికొస్తేనే తెలుస్తుంది.

బై... ఉంటానే...

నీ రాణి....

కడప

(పి.ఎస్: ఇట్లాంటివి ఎన్నో రాత్రిళ్ళు.. ఎన్నో పగళ్ళు... అలవాటుపడ్డాను... నాలోకం ఒకటి నిర్మించుకొన్నాను. నా ఐప్యాడ్.. అందులో కోరిన మ్యూజిక్.. నా చిన్నలైబ్రరీ.. అందులో నాకిష్టమైన సాహిత్యం.. నా లోకం నేను కట్టుకొన్నాను.

నాకు ఎప్పుడు ఇబ్బందిగా అన్పిస్తే అందులోకి వెళ్ళిపోతాను. ఆయనే చిన్న చిన్న విషయాలకు కూడా కుళ్ళి కుళ్ళిపోతూ...తనను చూస్తే నాకిప్పుడు జాలేస్తోంది. చాలా దురదృష్టవంతుడు... ఒక హృదయపూర్వకమైన మాటతో, స్పర్శతో, చిరునవ్వుతో నవమన్మథుడిలా నా ప్రపంచంలోకి రారాజుగా రావచ్చు. స్వర్గం చూపించేదాన్ని. ప్చ్...ఆయనకు నరకమే కావాలి. ఏం చేద్దాం?)

● స్వాతి - జూన్ 2008 ●